బస్సు రాదు.. సమస్య తీరదు

- రోడ్లు ఉన్నా ఆర్టీసీ సేవలు కరువు
- తప్పని పరిస్థితుల్లో ఆటోల్లో ప్రయాణం
- పరిమితికి మించి తరలిస్తున్న ప్రైవేట్ వాహనదారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు


ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ప్రమాదపుటంచున ప్రయాణం సాగిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని పాఠశాలలకు వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వారిది. నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో ఎక్కువ మందిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేట్ వాహనదారులు రెచ్చిపోతున్నారు. భద్రత చర్యలను పట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మండలంలోని ఇటిక్యాల, బెల్గాం, ఖప్రి, వావుదాం, మోవాడ, వెంకట్‌పూర్, బాబాపూర్, అక్సాపూర్, మేటిగూడ, గుండిగూడ, లంపూర్, ఆలీగూడ, పర్సనంబాల, గోల్లగూడ, కోమ్ముగూడ, ఈదులవాడ, రహపల్లి, రాజుర నుంచి విద్యార్థులతో పాటు సాధారణ ప్రజలు వందల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం జిల్లాకేంద్రానికి ప్రైవేట్ వాహనాల్లో వెళ్తుంటారు.

లాభాపేక్షే ధ్యేయంగా..

లాభాల కోసం తప్పా విద్యార్థుల జీవితం గురించి ప్రైవేట్ వాహనదారులు ఆలోచించడం లేదు. డబ్బుల కోసం ఒక్కో ఆటోలో సుమారు 10 నుంచి 13 మందిని ఒకేసారి తరలిస్తున్నారు. ఇతర ప్రైవేట్ వాహనాల్లో కూడ నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో మందిని కూర్చోబెడుతున్నారు. ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో పిల్లలను పంపాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాహనదారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

వందల్లో ప్రైవేట్ వాహనాలు..

ఆర్టీసీ బస్సు సేవలు ఆయా గ్రామాలకు కల్పించకపోవడంతో విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా ఉన్న ఆర్టీసీ అధికారులు బస్సులు వేయడం లేదు. దీంతో వందలాది మంది ప్రజలు, విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు పెట్టుకుని, ప్రమాదకరంగా జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మాది బెల్గాం గ్రామం. మూడేళ్ల క్రితం ఐదు నెలల పాటు బస్సు సౌకర్యం కల్పించారు. తరువాత నుంచి బస్సు రావడం లేదు. మా గ్రామంతో పాటు సుమారు పది గ్రామాల వాసులం బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆటోలపైనే ప్రయాణం చేస్తున్నాం. అధికారులు స్పందించి మళ్లీ బస్సు సౌకర్యం కల్పించాలి.

- నాగోరావు, బెల్గాం

క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి


సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెజ్జూర్: రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని ఏఈవోలు శ్రీధర్, మీన అన్నారు. శుక్రవారం మండలంలోని పాపన్‌పేట్ గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి 90శాతం సబ్సిడీపై డ్రిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక కుటుంబానికి 12.5 ఎకరాల వరకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఒక ఎకరంలో 57 ఆయిల్‌పామ్ మొక్కలు సాగవుతాయని, మొక్క ధర రూ.193 ఉంటుందని, సబ్సిడీ కింద రూ.20 చెల్లిస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుజాడి శేఖర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేయాలని ఎంఈవో విజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కర్జెల్లి, రుద్రపూర్ రైతులకు ఆయిల్‌పామ్ మొక్కల సాగుపై అవగాహన కల్పించారు.

హిందూవాహిని కార్యవర్గం ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ హిందూవాహిని నూతన మండల కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా హిందూవాహిని అధ్యక్షుడు యోగాచార్య అశోక్ ఆర్య, ఉపాధ్యక్షుడు సైదం నాగరాజుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో కార్యదర్శిగా పట్టణానికి చెందిన చీల నితీష్‌ను నియమించారు. మండల కమిటీలో అధ్యక్షుడిగా దుడిసె వినోద్, ప్రధాన కార్యదర్శిగా బొట్టుపల్లి సాయికృష్ణ, ఉపాధ్యక్షులుగా గురుమూర్తి, రవి, కార్యదర్శులుగా పవన్ కల్యాణ్, తరుణ్, సహాయ కార్యదర్శులుగా సాయిచరణ్, నరేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ ఖండ్ సహ కార్యదర్శి వేణుగోపాల్, కార్యకర్తలు దిలీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలు ధ్వంసం


ధ్వంసమైన శివమల్లన్న విగ్రహాలు

బెజ్జూర్: మండలంలోని అందుగులగుడ గ్రామ సమీపంలోని శివమల్లన్న ఆలయంలో గల విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. దీనిపై బెజ్జూర్ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

సాక్షి సినిమాలు



ఆసిఫాబాద్

కుమురంభీం :రైటర్ పద్మభూషణ్

కాగజ్‌నగర్

వెంకటరమణ :రైటర్ పద్మభూషణ్

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.20
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	30
బీరకాయ	40
వంకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	120
అలసంద	40
దొండకాయ	80
సోరకాయ	60
పాలకూర	60
గోబి(పూల్)	40
క్యారెట్	50
చామగడ్డ	80
క్యాబేజ	40
సిమ్లామిర్చి	100

-ఆసిఫాబాద్‌అర్బన్

అంతర్గత రోడ్ల సమస్యకు చెక్

- మంజూరైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప (ఫైల్)

సిర్పూర్(టి): మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న అంతర్గత సీసీరోడ్ల సమస్యకు చెక్ పడనుంది. 2022 -23 సంవత్సరానికి గాను నియోజకవర్గ గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మండల కేంద్రంలోని ప్రధాన అంతర్గత రహదారులతో పాటు 16 గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గల రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి సీసీరోడ్లు ప్రారంభిస్తే ఆయా గ్రామాల్లోని అంతర్గత రోడ్ల సమస్యలు తీరనున్నాయి. ప్రతీ ఏటా వర్షాకాలంలో గ్రామాల్లోని కాలనీల్లో గల అంతర్గత రహదారులు బురదమయంగా మారడం, గుంతలతో నిండి ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారుల నిర్మాణాలు పూర్తి చేస్తే ప్రజలకు రోడ్ల సమస్య ఉండదు.

మంజూరైన సీసీ రోడ్లు..

సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బెంగాలీ క్యాంపులో రూ. 30లక్షల ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో సీసీరోడ్డు, షిమ్లానగర్ కాలనీలో రూ. 20లక్షల నిధులతో సీసీరోడ్డు, గొల్లవాడ కాలనీలోని ప్రధాన రహదారికి రూ. 10లక్షలతో సీసీరోడ్డు, మండలంలోని లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ పరిధిలో రూ.10లక్షల నిధులతో సీసీరోడ్డు, చింతకుంట గ్రామపంచాయతీ, చీలపెల్లి, భూపాలపట్నం, వేంపల్లి, మేడిపల్లి, హుడ్కిలి, అచ్చెల్లి, పారిగాం, లోనవెల్లి, డోర్‌పల్లి, కర్జపల్లి, నవేగాం, వెంకట్రావ్‌పేట్ గ్రామపంచాయతీల్లో రూ. 5 నుంచి రూ.10లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మండల కేంద్రంలోని బెంగాలీ క్యాంపు కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఈనెల 15న పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు.

'బాబా చూపిన మార్గంలో నడవాలి'


మాట్లాడుతున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

వాంకిడి: పూలాజీ బాబా చూపిన ఆధ్యాత్మిక మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పూలాజీ బాబా ధ్యాన కేంద్రం వారికోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ధ్యాన మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా మనసు ఆధీనంలో ఉండటమే కాకుండా చెడు వ్యసనాలకు దూరమవుతామన్నారు. కార్యక్రమంలో బాబా కుమారుడు కేశవ్, భగవంత్‌రావు, మహరాజ్, పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, ధ్యాన కేంద్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం

- డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు


మాట్లాడుతున్న పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూర్: బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని సిర్పూర్ బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని రెబ్బెన, సలుగుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాగోస -బీజేపీ భరోసా శక్తి కేంద్రాల సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. పోడు సమస్యను జఠిలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సమావేశాల్లో ప్రభారీ రాజమౌళి, బీసీమోర్చ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, దళిత మోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్షుడు దిగంబర్, ఇన్‌చార్జి సమీర్ గుప్తా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మాలి కులస్తులను మోసం చేసిన సీఎం కేసీఆర్, సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీజేపీ నేత పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఏటిగూడ, రుద్రపూర్ గ్రామాల్లో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, నాయకులు బండి రాజేందర్‌గౌడ్, తిరుపతిగౌడ్, సౌమ్య, ఉమామహేష్, కవిరాజ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ బూత్‌లల్లో ప్రజాగోస కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేఖ విధానాలపై క్షేత్రస్థాయి నుంచి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ సార రమేశ్ గౌడ్, మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు గోపాల్, తిరుపతి, తులసీరాం, కనక హన్మంత్‌రావు, శ్రీధర్, దౌలత్‌రావు, ధర్మ, సుభాష్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.స్వరూప అన్నారు. శుక్రవారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు పార్టీ, కళాశాల స్పోర్ట్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో, ఇతర రంగాల్లో రాణించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించి మధ్యాహ్న భోజనం అందించిన ఎమ్మెల్యే కోనప్ప పేరును విద్యార్థులు నిలబెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు ఆంజనేయులు, బాలకిషన్ రావు, అశోక్, రాజమల్లు, రామారావు, రాము, మోతిలాల్‌నాయక్, రాంబాబు, శ్రీనివాస్ నాయక్, రజిత, సమతా, తస్లీమున్నిసా బేగం, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ సుమలత

రెబ్బెన: ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో రామకృష్ణ, గోలేటి సర్పంచ్ పోటు సుమలతలు అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్యశిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజలు కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఏప్రిల్ 11వరకు కంటి వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వార్డుసభ్యులు కవిత, తిరుపతి, శంకర్, వైద్య సిబ్బంది రాకేష్, సుజిత్, పంచాయతీ కార్యదర్శి జలందర్, కారోబార్ సుధాకర్ పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్2 గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, సర్పంచ్ సుశీల్ మండల్, నాయకులు డుబ్బుల వెంకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల మార్కుల పరిశీలన


దహెగాం: ధ్రువీకరణపత్రం అందజేస్తున్న పరిశీలన బృందం

దహెగాం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను ఉపాధ్యాయ బృందం పరిశీలించింది. బృంద సభ్యులు భరత్, శ్రీనివాస్, మల్లికార్జున్ మార్కులను పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

వాంకిడిలో..

వాంకిడి: మండలంలోని ఇందాని, ఖిరిడి, వాంకిడి జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలతో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను ప్రత్యేక బృందం సభ్యులు పరిశీలించారు. రాథోడ్ సుభాష్ నాయకత్వంలో సంతోష్ కుమార్, సత్య నారాయణతో కూడిన బృందం మండలంలోని ఉన్నత పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో సీఆర్పీ దుర్గం సందీప్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే ఉన్నత పాఠశాల, మండలంలోని ఆరెగూడ, గన్నారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను శుక్రవారం పరిశీలన బృందం సభ్యులు నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, హదియాబేగం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు జయప్రద, రవిశంకర్, సవితలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ పుష్పలత

బెజ్జూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత అన్నారు. మండలంలోని మర్దిడి గ్రామంలో నిర్వహించిన కోనేరు యువసేన యూత్ క్రీడోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతగా ఎస్‌ఎస్‌వై, రన్నర్‌గా మర్దిడి జట్లు నిలవగా కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్‌తో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఓంప్రకాష్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, మర్దిడి సర్పంచ్ బొర్కుట్ లీల తులసీరామ్, పోతేపల్లి సర్పంచ్ గుండయ్య, ఎంపీటీసీ వెంకన్న, ఉపసర్పంచ్ శ్రీను, నాయకులు రాజారామ్, శ్రీను, అజీమ్‌ఖాన్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ కన్వీనర్ అరుణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: సీనియర్ వేధింపుల కారణంగా వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఆత్మహత్య యత్నం చేసిన విద్యార్థిని ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జుమ్మిడి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిందితుడుని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఏబీవీపీ కాగజ్‌నగర్ కార్యదర్శి యశ్వంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఊశన్న, నవీన్, ఎస్.కార్తీక్, గణేష్, మహిళ కార్యకర్తలు శ్రావణి, తేజ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ


ఒడ్డుగూడలో మందులు వేస్తున్న పశువైద్యాధికారి

దహెగాం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేకలు, గొర్రెలకు వేస్తున్న నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం మండలంలో కొనసాగుతోంది. శుక్రవారం మండలంలోని ఒడ్డుగూడ, బామానగర్, గ్రామాల్లో మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో 1259 మేకలు, 1810 గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో బామానగర్ ఉపసర్పంచ్ లింగయ్య, నాయకులు దందెర వెంకన్న, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని గురుడుపేట, తాటినగర్ గ్రామాల్లో శుక్రవారం కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పశువైద్య సిబ్బంది మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచ్ సోమయ్య, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, సిబ్బంది రాజన్న, సందీప్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు శిక్షణ

రెబ్బెన: గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 100 పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు ఉన్నతి కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మండలంలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో 100 పని దినాలు పూర్తి చేసుకున్న అర్హులైన కూలీలు శనివారం ఉదయం 10 గంటలకు రెబ్బెన ఎంపీడీవో కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. ఎస్‌ఏసీ రిసోర్స్ పర్సన్ వ్యవసాయ అనుబంధ పనులపై కూలీలకు ప్రత్యేక శిక్షణ అందిస్తారని తెలిపారు.

కొంతైనా.. చేతికొచ్చేనా..!



కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లిలో పెర్క సంతోశ్‌కు చెందిన పత్తి, వరి ధాన్యం ఇటీవల ప్రమాదవశాత్తు దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. శుక్రవారం సంతోశ్ దంపతులు కాలిపోయిన పత్తి నుంచి పనికొచ్చే పత్తిని వేరు చేస్తూ కన్పించారు. కాలిన పత్తి నుంచి కొంతలో కొంతైనా మంచి పత్తిని వేరు చేసి విక్రయిస్తే డబ్బులు వస్తాయనే ఆశతో ఈ పని చేస్తున్నట్లు వారు తెలిపారు. నష్టపరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందని వారు వాపోయారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

నార్నూర్: విద్యార్థుల చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నాబావు సాఠె జిల్లా కమిటీ అధ్యక్షుడు కాంబ్లె ఉదయ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు దివంగత డీసీసీబీ చైర్మన్ కాంబ్లె నాందేవ్ స్మారకార్థం శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. మొత్తం 263 మంది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నప్పారెడ్డి, అన్నాబావు సాఠె మండల కమిటీ అధ్యక్షుడు కొర్రెళ్ల మహేందర్, కార్యదర్శి భరకుంబే రాజు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మోతే రాజన్న, పీఏసీఎస్ డైరెక్టర్లు రాము, కేశవ్ తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కెరమెరి: మండలంలోని సావర్‌ఖెడా గ్రామంలో శుక్రవారం ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. సర్పంచ్ కావ్‌డే తుల్సిరాం, జగన్నాథ్‌రావు, నాయకులు భరత్, ధర్మ, భీంరావు తదితరులు ఉన్నారు.